# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## రైతులను వంచించడమే కాంగ్రెస్ నైజం

**- పిడిశెట్టి రవి, రైతు, వెంకటాపురం**



దామెర : సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణిని కాంగ్రెస్ తీసివేస్తామనడం మూర్ఖత్వం. కాంగ్రెస్ హయాంలో భూముల రికార్డులు సరిగా ఉండకపోయేవి. వాటితో గొడవలు జరిగేవి. పట్వారీలు లంచాలు తీసుకుని తక్కువ, ఎక్కువ విస్తీర్ణాలు రికార్డుల్లో నమోదు చేసేవారు. చాలా చోట్ల తప్పుడు సర్వేనంబర్లు ఉండేవి. సీఎం కేసీఆర్ ధరణిని తీసుకురావడం వల్ల రైతులకు పక్కాగా భూమి, విస్తీర్ణం నమోదైంది. పైరవీకారులు లేరు. వ్యవసాయ భూమి అమ్మకానికి పెడితే నయా పైసా లంచం లేకుండా రిజిస్ట్రేషన్ అవుతున్నది. ఐదు నిముషాల్లోనే పట్టాదార్ పాసు పుస్తకం ప్రొసీడింగ్స్ చేతికి అందుతున్నయ్. ఇంతకన్నా ఇంకేం కావాలి. ధరణిని తీసేస్తామంటున్న కాంగ్రెస్ కుట్రను రైతులమంతా తిప్పికొడతాం.

## ధరణి తీసేస్తే ఎవుసం కుంటుపడతది

**- బీరవెల్లి బుగులారెడ్డి, రైతు, పెద్దకొర్పోలు**

నెక్కొండ: తెలంగాణ వచ్చాక రైతులు ఏటా రెండు, మూడు పంటలు సాగుచేస్తూ దర్జాగా బతుకుతున్నరు. కాంగ్రెస్ పార్టీ ధరణిని రద్దు చేస్తే ఎవుసం కుంటుపడ్తది. ప్రస్తుతం భూమి సాగుచేయలేని రైతు కౌలుకు ఇచ్చినా ఎలాంటి ఢోకా లేదు. ధరణి రద్దు చేసి, పట్టాలో కౌలుదారు కాలమ్ పెడితే భూమిపై హక్కులు పోతాయని యజమాని ఎవరికీ భూమిని కౌలుకు ఇవ్వడు. భూమిని పడావు పెడతాడు. సాగు భూములు బీళ్లుగా మారుతయి. ధరణీ రద్దయితే మళ్లీ పాతకాలం రోజులు వస్తాయి. వీఆర్వోలు, వీఆర్ఏలు వచ్చి చేరితే రికార్డులన్నీ తారుమారవుతాయి. అక్రమాలకు తెరలేస్తది. ధరణీ ఉండటంతో రైతుబంధు సాయం ఎవరిచుట్టూ తిరుగకుండా నేరుగా రైతు ఖాతాలో వచ్చి పడుతోంది. ఏటా పహాణీలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు తిరిగే పరిస్థితులు పోయినయి. రైతులందరూ సక్కగా వ్యవసాయం చేసుకుంటున్నరు. ధరణీలో కొత్తగా తీసుకువచ్చిన మాడ్యుల్స్‌తో దాదాపు రైతుల సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయి. ధరణీలో పరిష్కారంకాని సమస్యలను కొత్త మాడ్యుల్స్ తీసుకువచ్చి పరిష్కరించాలి. రైతుల మధ్య చిచ్చుపెట్టే కాంగ్రెస్ విధానాలను రైతులంతా తిప్పికొట్టాలి. రానున్న ఎన్నికల్లో గంపగుత్తగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి.





## సగం భూములు బీళ్లుగా మారుతాయి

**- పొన్నాల రాజు, రైతు, ఒంటిమామిడిపల్లి**

ఐనవోలు : మూడు గంటల కరెంటు ఇస్తామంటే ఒక్క రైతు ఎన్ని ఎకరాలు సాగు చేస్తడు? తెలంగాణ రైతులు మంచిగ బతుకుతుంటే రేవంత్‌రెడ్డి చూడలేకపోతున్నడు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే ముందుగా రాష్ట్రమంతా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. ఎందుకంటే ప్రస్తుతం రైతులందరూ త్రీ హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని నడిపిస్తున్నరు. ప్రస్తుతం పడే కరెంటు లోడ్ ప్రకారం అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే ఉన్న పణంగా రాష్ట్రమంతా ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలి. రేవంత్‌రెడ్డికి అసలే ఎవసాయంపై అవగాహన లేదని అర్థమైతుంది. మూడు గంటల కరెంటు వస్తే తెలంగాణలో సగం భూములకు పైగా బీల్లుగా మారుతయ్.

## ధరణికి తిరుగులేదు

**- గొల్ల రాజు రైతు, నడికూడ**



నడికూడ : కాంగ్రెస్ నాయకులు ధరణి పోర్టల్‌పై పడి ఏడుస్తున్నరు గానీ, అది ఎంత మంచిగ పనికొస్తుందో నిజంగా వాళ్లకు తెలుసో లేదో అర్థమైతలేదు. ఆనాడు భూమి రికార్డులు సక్కగ ఉన్నయో, లేవో తెల్వకపోయేవి. పట్వారీలు భూములను అవకతవకలు చేసేది. వాళ్ల కోసం కాళ్లు అరిగేలా తిరిగేది. కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసేది. ఒక్క పని కోసం చాలా రోజులు ఇబ్బంది పడేది. దళారుల చుట్టూ తిరిగి జేబులు ఖాళీ చేసుకోవాల్సి వచ్చేది. కాంగ్రెస్ వాళ్లు ధరణి తీసేస్తమంటే మాత్రం ఆ పార్టీకి డిపాజిట్ కూడ దక్కద్దు. ఏ మాట కామాటే ధరణి వచ్చినంక తక్కువ టైంలోనే రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ పనులు అయితానయ్. రైతులు వాళ్ల వేలు మిషన్ మీద పెట్టందే భూముల మార్పిడి జరగదు. అంతా ఆన్‌లైన్‌లో భద్రం చేస్తున్నారు. ఇంతకంటే రైతుకు వాళ్ల భూమిపైన భద్రత ఎట్లా చూపిస్తరు? కేసీఆర్ సారుకు కృతజ్ఞతలు.

## భూములు తారుమారు అన్న ప్రశ్నే లేదు

**- పోగులకొండ రాజమల్లు, రైతు, రాయపర్తి**



రాయపర్తి : తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మాకు భూములకు సంబంధించిన బాధలు తొలగినయ్. తెలంగాణ ఒచ్చిన తర్వాత వ్యవసాయ భూముల పాత పాసు బుక్కులు, తోక పాసు పుస్తకాలను తీసేసి ధరణి ద్వారా మాకు కొత్త పుస్తకాలను ఉచితంగా అందజేశారు. అప్పటి నుంచి మా భూములు ఎక్కడ కూడా తారుమారు కావడం లేదు. ఎనకటికి అయితే పట్టాదారుల పాసు పుస్తకాల్లో రైతుల భూములు వానకాలంలో ఓ సర్వే నంబర్‌లో ఉంటే.. యాసింగికి ఇంకో నంబర్‌లో ఉండేది. ఎకరం భూమున్న ఆసామి ఆర్నేళ్ల తర్వాత కంప్యూటర్ పానీ నకల్ తీసుకుంటే 20 గుంటలో, 30 గుంటలో ఉండేది. పోయిన భూమిని మళ్లా ఎక్కియ్యమని ఎమ్మార్వో ఆఫీస్ సుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పనికాకపోయేది. ధరణి తెచ్చిన తర్వాత భూముల తిప్పలు తప్పినయ్.

## భూములు ఆగమే..

**- బండి రమేశ్, రైతు, పరకాల**



పరకాల : ధరణి పోర్టల్ లేకుంటే రైతుల భూములు మళ్లీ ఆగమైతయ్. ఉమ్మడి రాష్ట్రంలో రైతుల భూ వివరాలు పట్వారీల చేతిలో ఉండేది. అప్పుడు ఒకరి పేరుమీద ఓ రోజున ఉంటే మరో రోజుకు మరొకరి పేరున మారేది. పట్వారీలు తమ ఇష్టం వచ్చినట్లు రైతుల పేర్లు మార్చేది. అసలు రైతులు ఎన్ని రోజులు తిరిగినా.. పైసా లేనిదే ఏ పని కాకపోతుండే. గీదేందని అడిగితే సమాధానం చెప్పేటోళ్లే లేకపోతుండే. కానీ, తెలంగాణ రాష్ట్రంలో ధరణి వచ్చినంక రైతుల భూములకు భద్రత వచ్చింది. ధరణి పోర్టల్‌లో ఎక్కడ ఉన్నా రాష్ట్రంలోని భూ వివరాలను తెలుసుకోవచ్చు. అంతేకాకుండా రైతుల వేలుముద్రలు లేకుండా భూ మార్పిడి జరుగదు. రైతులకు భూములపై భరోసా కల్పించింది ధరణి. అయితే కాంగ్రెస్ నాయకులు భూములను దోచుకునేందుకు ధరణిని తీసేస్తామని చెప్తున్నరు. ధరణిని తీసేస్తే మళ్లా పాత రోజులు వస్తయ్.. భూములకు రక్షణ ఉండదు. రైతులు ఇబ్బందులు పడ్తరు. కాంగ్రెస్‌కు ఓటేస్తే దళారులు రాజ్యమేలుతారు. ఖచ్చితంగా రైతుల భూములు ఆగమైతయ్..

## రికార్డులు మారడం ఖాయం

**- యాళ్ల తిరుపతిరెడ్డి, రైతు, పెంచికల్‌పేట**



ఎల్కతుర్తి : పట్వారీ వ్యవస్థ వస్తే ఇప్పుడు మంచిగున్న రికార్డులన్నీ తారుమారవుతాయి. ధరణిని తీసేస్తే ఒకరి పేరున ఉన్న రికార్డులు మరొకరి పేర రాస్తారు. మా తాతల పేరు మీద ఉన్న భూమిని ఇది వరకు మా పేరు మీద వారసత్వంగా చేయించుకునేందుకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు భూములకు సంబంధించి వన్‌బీ, పహాణి, ఈసీ అన్ని పత్రాలు మీ సేవలోనే తీసుకుంటున్నాం. గిదివరకు ఇట్లా లేకుండే రికార్డు పత్రాల కోసం పట్వారీల చుట్టూ తిరిగేది. నెలలు పట్టేది. ఎప్పుడు ఎవరి పేరు మీద భూమి ఉంటుందో అనే భయం ఉండేది. ఇప్పుడు భూములు భద్రంగా ఉన్నాయి. భూ యజమాని వేలి ముద్ర వేస్తే తప్ప భూమి మారదు. ధరణిని తీసేస్తాం అనే వాళ్లు ఒక్కసారి రైతుల వద్దకు వెళ్లి విషయాలు మొత్తం తెలుసుకొని మాట్లాడాలి.

## కాంగ్రెస్ మాటలు నమ్మేదే.. లే..

**- కంబాల శ్రీనివాస్, రైతు, ఎల్కతుర్తి**



హనుమకొండ సబర్బన్ : మా నాయిన మాకు ఇంత భూమి సంపాయించి పోయిండు గాని మాకు పట్టా మాత్రం కాలేదు. ఎన్నో ఏండ్లుగా పట్టాలు లేకుంటనే ఎవుసం జేసుకుంటున్నం. గిప్పుడు కేసీఆర్ సారు వచ్చినంకనే భూములకు పట్టాలు అయినవి. మా భూమిని ఇంకొకలు గుంజుకోకుంట పకడ్బందీ తాళం ఏసినట్లు చేసిండు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వత్తే ధరణిని తీసేస్తామని చెబుతున్నరు. గిట్లయితే మళ్లీ మొదటి దరిద్రమే మొదలైతది. ఎనుకట మా ఊళ్లో పట్టాలు లేక వందల మంది చానా ఇబ్బందులు ఎదుర్కొన్నరు. భూమి పట్టా చేపిచ్చుకోవాల్నంటే కోళ్లు, గొర్లు కోసి దావతులు ఇచ్చేది. ఇంక పైసలు సుత ఇచ్చేది. పెద్దోళ్ల పనులు అయ్యేటివి. పైసలు లేకుంటే ఒకని భూమి ఒకనికి రాసెటోళ్లు. ఇప్పుడు వేలు ముద్ర పెడితేనే ఒకల భూమి ఇంకొకలకు మారెతట్లు కేసీఆర్ సారు మంచి ఇకమతు చేసిండు. మళ్ల భూములను ఆగం జేస్తమంటే ఊకోం. కాంగ్రెస్‌ను నమ్మేది లేదు. ఈ తాప కూడా బీఆర్ఎస్‌నే గెలిపించుకుంటం.

## కాంగ్రెసోళ్లు అన్నదాతల నోట్లో మట్టికొట్టాలని సూత్తాంద్రు



**-గన్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి, రైతు, సాయిరెడ్డిపల్లె**

నల్లబెల్లి: కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు ఇస్తామంటూ అన్నదాతల నోట్లో మట్టికొట్టాలని సూత్తాంద్రు. అప్పట్ల కాంగ్రెస్‌వాళ్లు చాలీచాలని కరెంటు ఇచ్చి రైతులను నట్టేట ముంచిండ్లు. అప్పట్లో గివీళ్లు చెయ్యబట్టే మా బతుకులు ఆగమైనై. మల్లా దాపురించిన్రు. ఒకరేమో మూడుగంటల కరెంట్ అనుడు, ఇంకొకరు ధరణి తీసేత్తామనుడు, మరొకరు 10 హెచ్‌పీ మోటర్లు పెడ్తామనుడు. అసలు వీళ్లకు అసలు ఎవసాయం చేసుడు తెలుత్తదా? మూడు గంటల కరెంటు ఇత్తే మూడు గుంటలైనా తడుత్తదా. మా కాడ 3హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నాం. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే డ్రిప్ ద్వారా పంటలకు నీరందించలేం. ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు కాలిపోవడం ఖాయం. ఇప్పుడిప్పుడే కాసంత పంటలు పండుతానై. కేసీఆర్ సార్ వచ్చినంక 24 గంటల కరెంటు ఇత్తాండు. రాత్రిపూట పంటలకు నీళ్లు పెట్టే తిప్పలు తప్పినై. మా అయ్యవ్వకు పింఛన్ ఇత్తాండు. పిండిబత్తాల కోసం ఎండలో లైన్‌కు నిలబడుడు లేదు. వ్యవసాయశాఖ సార్లు వచ్చి పంటలకు రోగాలు వత్తే ఏమందు కొట్టాలో చెబుతాన్లు. రైతు చనిపోతే రూ.5లక్షలు ఇత్తాండ్లు. పంటలు మంచిగా పండించుకుని అప్పులు లేకుండా బతుకుతున్నం. కేసీఆర్ సార్‌కు అన్యాయం చెయ్యం. మళ్లా కారుకే ఓటు గుద్దుతం.